తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
శనివారం
20 ఫిబ్రవరి 2026
Follow :



# ఆదర్శ పట్టణంగా ఆమనగల్లును తీర్చిదిద్దుతా

## ఆదర్శ పట్టణంగా ఆమనగల్లును తీర్చిదిద్దుతా

- ముస్సిపాలిటీ చైర్మన్ నేనావత్ పత్యా నాయక్ పదవి బాధ్యతలు స్వీకరణ..
- పారదర్శక పాలన,అభివృద్ధే లక్ష్యమని స్పష్టం..
- డ్రైనేజీ, త్రాగునీరు,రహదారులపై ప్రత్యేక దృష్టికి హామీ..
- నూతన చైర్మన్‌కు,పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపిన కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి



**ఆమనగల్ ఫిబ్రవరి 20 (జనంసాక్షి):** రంగారెడ్డి జిల్లాలోని ఆమనగల్ పురపాలక సంఘంలో నూతన చైర్మన్‌గా నేనావత్ పత్యా నాయక్, వైస్ చైర్మన్‌గా తల్లోజు గీత ఆచారి శుక్రవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా చైర్మన్, వైస్ చైర్మన్‌లతో పాటు పాలకవర్గ సభ్యులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడిన నూతన చైర్మన్ నేనావత్ పత్యా నాయక్ పట్టణ సమగ్ర అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తానని స్పష్టం చేశారు. ప్రజలకు పారదర్శకమైన, ప్రజాకేంద్రీకృత పాలన అందించడమే తన ప్రధాన బాధ్యతగా భావిస్తున్నానని, పట్టణ ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. పట్టణ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని వెల్లడించారు. ఇదివరకే 63 కోట్ల రూపాయలతో మౌలిక వసతుల కల్పనకు పనులు చేపట్టినట్లు గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో ప్రత్యేక నిధులు తీసుకొచ్చి ఆమనగల్‌ను సుందర పట్టణంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. అసంపూర్తిగా ఉన్న జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, పాలిటెక్నిక్ కళాశాల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసేందుకు కృతనిశ్చయంతో పనిచేస్తామన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆర్‌డీఓ, ఎస్టీఓ, ఆర్‌టీఓ కార్యాలయాలు, అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. గుర్రం గుట్టలో ఉన్న డంపింగ్ యార్డ్‌ను ఎమ్మెల్యే సహకారంతో పట్టణానికి దూరంగా మరో చోటకు తరలిస్తామని ప్రకటించారు. 15 వార్డుల్లోని సమస్యల పరిష్కారానికి వారానికి ఒక వార్డులో అధికారులు, కౌన్సిలర్‌తో కలిసి పర్యటనలు నిర్వహిస్తామని, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, తాగునీటి సరఫరా బలోపేతం, రహదారుల అభివృద్ధి, పారిశుద్ధ్య నిర్వహణ వంటి కీలక సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని వెల్లడించారు.ప్రజల అవసరాలను ప్రాధాన్యతగా తీసుకుని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు అమలు చేస్తామని, పట్టణ ప్రజలు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకుల సహకారంతో ఆమనగల్‌ను ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుతామని చైర్మన్ హామీ ఇచ్చారు. కార్యక్రమం అనంతరం పలువురు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు నూతన చైర్మన్, వైస్ చైర్మన్, పాలకవర్గ సభ్యులకు పూలమాలలు వేసి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్, రాష్ట్ర పొల్యూషన్ బోర్డు మెంబర్ బాలాజీ సింగ్, ఏఎంసీ చైర్మన్ యాట గీత, మాజీ జెడ్‌పీటీసీ కండే హరిప్రసాద్, పీసీసీ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహా, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దుర్గయ్య, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, తలకొండపల్లి మాజీ ఎంపీపీ రఘురాములు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు జగన్ తదితర మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



# మల్బరీ పంట సాగుపై విద్యార్థులకు అవగాహన

**తలకొండపల్లి ఫిబ్రవరి 20(జనంసాక్షి):** మల్బరీ పంట సాగు,పట్టుపురుగుల పెంపకం పై అవగాహన కల్పించేందుకు క్షేత్ర పర్యటనకు వచ్చిన నల్గొండ జిల్లా గుండ్లపల్లి మండలానికి చెందిన తెలంగాణ మోడల్ స్కూల్,జూనియర్ కళాశాల విద్యార్థులు,ఉపాధ్యాయులు వ్యవసాయ వృత్తి విద్యలో భాగంగా తలకొండపల్లి మండలంలోని కోరింతకుంట తండాలోని సేరికల్చర్ రిసోర్స్ సెంటర్ ను శుక్రవారం సందర్శించారు.విద్యార్థులకు పట్టుపురుగు జీవిత చరిత్ర,పట్టు తయారీ విధానం,మల్బారీ తోట పెంపకం వాటి గురించి సెంటర్ నిర్వాహకుడు శక్రు నాయక్ విద్యార్థులకు వివరించారు.ప్రత్యక్షంగా విద్యార్థులు పట్టుపురుగు పెంపకం మల్బారీ పంట సాగు విధానంలో అవలంబిస్తున్న పద్ధతులను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు.వ్యవసాయంలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాన్ని ఈ పంట సాగులో పొందవచ్చునని విద్యార్థులకు వివరించారు.ఈ సందర్భంగా పట్టుదలతో పట్టుపురుగులను పెంచి వ్యవసాయాన్ని లాభసాటిగా చేసి ఆదాయాన్ని ఆర్జిస్తూ ఎందరో యువ రైతులకు ఆదర్శంగా నిలిచిన శక్రు నాయక్ ను ఉపాధ్యాయులు అభినందించారు. ఈ క్షేత్ర పర్యటనలో పాల్గొన్న ఉపాద్యాయులు వ్యవసాయ వృత్తి విద్య అద్యాపకుడు సందీప్, బిచ్చయ్య, విజయ్ కువర్, రమా, రుంషా, రమేష్, సోమయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనాన్ని అందించాలి

**ప్రైమరీ స్కూలు,అంగన్వాడి కేంద్రాలను సందర్శించిన సర్పంచ్ నిర్మల శ్రీశైలం**

**తలకొండపల్లి ఫిబ్రవరి 20 (జనంసాక్షి):** విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు భోజనాన్ని అందించాలని రాంపూర్ సర్పంచ్ వట్టెల నిర్మల శ్రీశైలం అన్నారు.శుక్రవారం రాంపూర్ గ్రామంలోని ప్రైమరీ స్కూల్,అంగన్వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.విద్యార్థులకు నాణ్యమైన విద్యను,పోషక ఆహారాన్ని ప్రభుత్వ మెనూ ప్రకారంగా అందిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో పాటు కూర్చొని భోజనం చేశారు.అనంతరం వారు మాట్లాడుతూ..విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు.విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలన్నారు.ఈ కార్యక్రమంలో రాంపూర్ ఉప సర్పంచ్ సప్పిడి ఆంజనేయులు,వార్డు సభ్యులు దొరిబాయి లాలమ్మ జంగయ్య,మాజీ వార్డు సభ్యులు మీసాల ఆంజనేయులు,గ్రామ యువ నాయకులు చిలుకం శేఖర్,రొయ్యల చిన్నయ్య,కాకి జగదీష్,తదితరులు పాల్గొన్నారు.

# శంషాబాద్ మండలంలో బాలిక అదృశ్యం



**రాజేంద్రనగర్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** శంషాబాద్ పిఎస్ పరిధిలో బాలిక అదృశ్యమైన ఘటన చోటుచేసుకుంది. ఇన్స్పెక్టర్ నరేందర్ రెడ్డి ప్రకారం శంషాబాద్ మండలం రషీద్‌గూడ గ్రామానికి చెందిన అలే కన్తమ్మ (35), కూలి పనులు చేసుకుంటూ కుటుంబంతో నివసిస్తోంది. ఆమె కుటుంబం నాలుగేళ్ల క్రితం వనపర్తి జిల్లా, వీపనగండ్ల గ్రామం నుండి ఉపాధి కోసం రషీద్‌గూడకు వలస వచ్చింది. ఫిర్యాదుదాలి కుమార్తె అలే సింధు (విద్యార్థిని) గురువారం ఉదయం ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో కనిపించకుండా పోయింది. అదే రోజు సాయంత్రం కుటుంబ సభ్యులు ఈదమ్మ జాతర నుండి తిరిగి వస్తుండగా, ఇంటి తలుపుకు తాళం వేసి ఉండటం గమనించారు. రాత్రి 11:30 ఇంటికి చేరుకుని లోపల పరిశీలించగా, సింధుకు సంబంధించిన బట్టలు, చదువు సర్టిఫికెట్లు కనిపించలేదు.బాలిక ఎత్తు సుమారు 4.8 అడుగులు, చామనచాయ వర్ణం. వెళ్లే సమయంలో వైట్ కలర్ టాప్, పర్పుల్ కలర్ ప్యాంట్ ధరించి ఉంది. ఆమె తెలుగు, హిందీ భాషలు మాట్లాడగలదు. బంధువులు పరిసర ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఎలాంటి ఆచూకీ లభించకపోవడంతో ఫిర్యాదు మేరకు పీఎస్ పెద్దషాపూర్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఇన్స్పెక్టర్ తెలిపారు.

# మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేయాలి




**ఉప్పల్ ఫిబ్రవరి 20 (జనం సాక్షి ):** ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌విఎస్‌ఎస్ ప్రభాకర్ రామంతపూర్ ప్రాంతంలో కీలక అంశంపై భారీ ర్యాలీ నిర్వహించారు. రామంతపూర్ చెరువు పైభాగంలో దేశానికి, సమాజానికి విశిష్ట సేవలందించిన మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ప్రభాకర్ పిలుపు మేరకు వందలాది మంది స్థానికులు, యువత, మహిళలు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు. చెరువు పరిసర ప్రాంతం నినాదాలతో మారుమోగింది. "మహనీయుల ఆలోచనలు తరతరాలకు మార్గదర్శకం కావాలి", "చరిత్రను నిలబెట్టేలా విగ్రహాలు ఏర్పాటు చేయాలి" అంటూ ప్రజలు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ, రామంతపూర్ చెరువు ప్రాంతాన్ని కేవలం జలవనరుగా కాకుండా సాంస్కృతిక, చారిత్రక ప్రాధాన్యం కలిగిన ప్రదేశంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. మహనీయుల విగ్రహాల ఏర్పాటు ద్వారా యువతకు స్ఫూర్తి కలుగుతుందని, భవిష్యత్ తరాలకు వారి సేవలను గుర్తు చేసేలా నిలిచే కేంద్రంగా మారుతుందని పేర్కొన్నారు. ర్యాలీ అనంతరం సంబంధిత అధికారులకు వినతిపత్రం సమర్పించినట్టు తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రజల భావోద్వేగాలను గౌరవిస్తూ తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ర్యాలీ స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

## నిజాలను నిర్భయంగా రాస్తున్న జనంసాక్షి పత్రిక

- కేతిరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ గొడుగు యాదయ్య
- జనంసాక్షి 2026 నూతన క్యాలెండర్ ఆవిష్కరించిన గ్రామ సర్పంచ్ గొడుగు యాదయ్య



**మొయినాబాద్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి):** నిజాలను నిర్భయంగా రాస్తూ.. ప్రజాదరణ పొందిన పత్రిక జనంసాక్షి దిన పత్రికని కేతిరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ గొడుగు యాదయ్య పేర్కొన్నారు. గురువారం చత్రపతి శివాజీ జన్మదినం సందర్భంగా.. మొయినాబాద్ మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి చౌరస్తా లోగల శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి అనంతరం జనంసాక్షి 2026 నూతన క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేతిరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ గొడుగు యాదయ్య వంశీధర్ రెడ్డి మాట్లాడుతూ.. నిజాలను నిర్భయంగా రాస్తూ.. ప్రజల ఆదరణ పొందిన పత్రిక జనంసాక్షి దిన పత్రికని అన్నారు. ప్రజాసమస్యలు వెలుగులోకి తెస్తూ.. వాస్తవాలను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేస్తూ.. నిజాలను నిర్భయంగా చూపిస్తోందని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు, యువకులు, పాల్గొన్నారు.

## హనుమాన్..... దీక్షకు వేళాయే

- నేటితో...హనుమాన్ మండల దీక్ష ప్రారంభం
- దీక్ష సమితి సభ్యులు అనిల్ కుమార్



**తాండూరు ఫిబ్రవరి 20 (జనంసాక్షి):** హనుమాన్ మండల దీక్ష శనివారం ప్రారంభమవుతుందని దీక్ష సమితి సభ్యులు అనిల్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దీక్ష తీసుకోవాలని ఆసక్తిగల యువకులు కింది నెంబర్లకు 95818 18003 సంప్రదించాలని కోరారు. హనుమాన్ దీక్ష తీసుకోవడం ద్వారా మంచి ఫలితాలు ఉంటాయని, భక్తిశ్రద్ధలతో భగవంతునిపై నమ్మకం ఉంచి నియ మనిష్టలతో 41 రోజులపాటు దీక్ష చేస్తే సత్ఫలితాలు లభిస్తా యని వెల్లడిం చారు. హనుమాన్ జి దీక్ష చేపట్టి స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

## తోపులాట కేసులో రోహిత్ రెడ్డి, పార్టీ నేతలకు బెయిల్

- కేసును కొట్టివేత కోసం హైకోర్టులో మరో పిటిషన్
- వివరాలు వెల్లడించిన బిఆర్ఎస్ పార్టీ నేతలు



**తాండూరు ఫిబ్రవరి 20(జనంసాక్షి)** తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డికి బేయిల్ మంజూరు అయ్యింది. హైకోర్టు నుంచి బేయిల్ మంజూరు ఉత్తర్వులు జారీ అయినట్లు పార్టీ నాయకులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఈనెల 13న పట్టణంలోని సెయింట్ మార్క్స్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన కౌంటింగ్ హాల్ వద్ద జరిగిన తోపులాట వివాదం జరిగింది . ఈ ఘటనలో మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డితో పాటు మరో 8 మంది పార్టీ నాయకులపై తాండూరు పోలీస్ స్టేషన్ లో నాన్ బేయిలేబుల్ కేసు నమోదయ్యింది.దీనిపై మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు శుక్రవారం తోపులాట కేసులో రోహిత్ రెడ్డికి, పార్టీ నేతలకు బెయిల్ మంజూరు చేసినట్లు పార్టీ నేతలు తెలిపారు. దీంతో రోహిత్ రెడ్డి, నేతలకు ఊరట లభించింది. అదేవిధంగా తాండూరు పోలీసులు పెట్టిన కేసును కొట్టివేయాలని రోహిత్ రెడ్డి మరో పిటిషన్ కూడా దాఖలు చేశారు.

# చిలుకానగర్ బీఆర్ఎస్‌కు భారీ షాక్

## కాంగ్రెస్‌లోకి మాల, మాదిగ సంఘాల నాయకులు



**ఉప్పల్ (జనంసాక్షి):** ఉప్పల్ నియోజకవర్గం, చిలుకానగర్ ఉప్పల్ నియోజకవర్గంలో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. చిలుకానగర్ డివిజన్‌లో బీఆర్ఎస్ పార్టీకి మరోసారి భారీ షాక్ తగిలింది. డివిజన్‌కు చెందిన మాల, మాదిగ సంఘాల నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ మందుముల పరమేశ్వర్ రెడ్డి సమక్షంలో ఈ చేరికలు జరిగాయి.ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలను మోసం చేసి దోపిడీ చేశారని తీవ్ర ఆరోపణలు చేశారు. అభివృద్ధి, సంక్షేమం పేరుతో నాయకులే లాభపడి పోయారని విమర్శించారు. ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, అందుకే కాంగ్రెస్ వైపు ఆకర్షితులవుతున్నారని పేర్కొన్నారు. బన్నాల పన్ను పేరుతో వసూళ్లు తీవ్ర ఆరోపణలు చిలుకానగర్ డివిజన్‌లో గతంలో కార్పొరేటర్‌గా ఉన్న వ్యక్తి బన్నాల పన్ను పేరుతో భారీగా వసూళ్లు నిర్వహించాడని పరమేశ్వర్ రెడ్డి ఆరోపించారు. హైకోర్టు కాలనీ సమీపంలో సుమారు రూ.100 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కబ్జా చేశారన్న ఆరోపణ లు కూడా చేశారు. ఇలాంటి అక్రమాలు ఎన్నో జరిగాయని తెలిపారు.రాష్ట్రంలో ప్రస్తుతం ఇందిరమ్మ రాజ్యంలో ప్రజాపాలన కొనసాగుతోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల పథకాలతో అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ వైపు మళ్లుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్‌లో చేరిన నాయకులుకాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో రమణ, చెర్ల బలరాం, కొంద్ర రాములు, మారేపాక సాయిలు, పోలాటి కిష్టయ్య, కూరెల్లి యాదగిరి, రాంనర్సయ్య, సిహెచ్ ఐలయ్య, మారేపాక నాగయ్య, బి అంజయ్య, ఎస్ నరసింహ, పోడిశెట్టి కృష్ణ, ఎం శ్రీనివాస్, జి రాములు, ఎం శ్రీనివాసరావు, రవి, మురళి, బాబురావు, కనక రాజు, ఎల్ల స్వామి, రాజేందర్, సలేందర్, కోటి, కార్తీక్, భాస్కర్, వెంకటస్వామి, పోచయ్య, బాల కృష్ణ, రామకృష్ణ, మహేష్, రాములు ఉన్నారు.

## సిరిపురం యాదయ్యకు నివాళులు అర్పించిన

### తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారులు జెనిగె విష్ణువర్ధన్



**హయత్ నగర్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్రం సాధన కోసం అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో పెట్రోల్ పోసుకొని ప్రాణం త్యాగం చేసిన సిరిపురం యాదయ్య 16 వ వర్ధంతి సందర్భంగా ఎల్బీనగర్ నియోజకవర్గం కొత్తపేట్ చౌరస్తాలోని సిరిపురం యాదయ్య విగ్రహానికి రాష్ట్ర తెలంగాణ ఉద్యమకారులు జెనిగె విష్ణువర్ధన్ పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జెనిగె విష్ణువర్ధన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన ప్రాణాన్ని అర్పించిన తెలంగాణ అమరవీరుడు సిరిపురం యాదయ్యను స్మరించుకోవడం మన అందరి బాధ్యత అని అన్నారు. వారి ఆశయ సాధన కోసం అందరం కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి రంగా రెడ్డి జిల్లా ఉద్యమ నాయకులు కొంతం యాదిరెడ్డి , గోర స్వామి సుందర్ గౌడ్, కారింగుల నరేందర్ గౌడ్, తెలంగాణ ఉద్యమకారులు, పాల్గొన్నారు.

## పేద ప్రజలకు నిత్యవసర వస్తువులను పంపిణీ చేసిన ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



**హయత్ నగర్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి):** వనస్థలిపురం డివిజన్ పరిధిలోని చింతలకుంట, జాంగీర్ నగర్ కాలనీ ఉన్న ఈ ఫిర్దోస్ మసీద్ లో బిస్మిల్లా వెల్ఫేర్ సర్వీసెస్ ఓవర్ ఆధ్వర్యంలో పేద ప్రజలకు నిత్యవసర వస్తువుల పంపిణీ కార్యక్రమంలో ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో నిరుపేద ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని దాదాపు 250 మందికి నిత్యావసర వస్తువులు ఇవ్వడానికి ముందుకు వచ్చిన బిస్మిల్లా వెల్ఫేర్ సర్వీసెస్ ఫౌండర్ అంజాద్ ఖాన్ ని వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టారాజశేఖర్ రెడ్డి, కైసర్, నవీద్, ముక్తార్, హకాని, అఫ్జల్, తదితరులు పాల్గొన్నారు.

## అలియాబాద్ మున్సిపాలిటీ చైర్మన్‌గా కమటం శిరీష కృష్ణారెడ్డి బాధ్యతల స్వీకరణ

### హాజరైన తోటకూర వజ్రెష్ యాదవ్



**శామీర్ పేట, ఫిబ్రవరి 20 (జనంసాక్షి):** అలియాబాద్ మున్సిపాలిటీ చైర్ పర్సన్‌గా శిరీష కృష్ణారెడ్డి మున్సిపాలిటీ కార్యాలయంలో శుక్రవారం చైర్మన్ ఛాంబర్‌లో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రెష్ యాదవ్ హాజరై శిరీష కృష్ణారెడ్డి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన శిరీష కృష్ణారెడ్డి పట్టణ అభివృద్ధి, మౌలిక వసతుల మెరుగుదల, ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తానని తెలిపారు. మున్సిపాలిటీ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలన సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కమిషనర్ చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్, ఏఎంసి చైర్మన్ నర్సింలు యాదవ్,తుంకి రమేష్, మున్సిపాలిటీ పెద్దలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నూతన వధూవరులకు ఆశీస్సులు

### డాక్టర్ సంపత్ కుమార్ దంపతులు

**తాండూరు (జనంసాక్షి):** నూతన వధూవరులను డాక్టర్ సంపత్ కుమార్ దంపతులు ఆశీర్వదించారు. శుక్రవారం కొడంగల్ నియోజకవర్గం రావులపల్లి గ్రామంలో తన అనుచరుడు శ్రీకాంత్ రెడ్డి బందువు (బసంత్ రెడ్డి ఐశ్వర్య) వివాహ మహోత్సవ కార్యక్రమంలో తాండూర్ బాలాజీ నర్సింగ్ హోమ్ అధినేత, బీవీజీ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ సంపత్ కుమార్ దంపతులు. నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మర్రెడ్డి పటేల్, రాజలింగం సెట్ తదితరులు పాల్గొన్నారు.



# కేశంపేట అభివృద్ధికి సహకారాన్ని అందిస్తా

### ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**కేశంపేట, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** మండల అభివృద్ధికి తన వంతు సహకారాన్ని అందిస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధి లోని ఆయా గ్రామాల సర్పంచులతో కలిసి ఎమ్మెల్యే పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. సంతాపూర్ గ్రామంలో లబ్ధిదారులతో కలిసి ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశాలు చేశారు. పాటి గడ్డ గ్రామ వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ ప్రహరీ గోడ నిర్మాణానికి భూమి పూజ చేశారు. మండల కేంద్రం నుండి చౌలపల్లి గ్రామానికి వెళ్లే రహదార ప్రధాన రహదారిపై బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. భోధునం పల్లి గ్రామం వద్ద వంతెన నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. నిర్ద వెల్లి గ్రామంలో సీసీ నిర్మాణ పనులను ప్రారంభించారు. కాకునూరు గ్రామం నుండి మహాలింగేశ్వర స్వామి దేవాలయం వరకు బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మహాలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మహాలింగేశ్వర స్వామి ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న పందెం బండ లాగుడు పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ఉన్న బడుగు బలహీన వర్గాల ప్రజల సంక్షేమం కోసం అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంతో పేదల సొంతింటి కల నెరవేరింద న్నారు. పాటిగడ్డ గ్రామ ప్రజలకు ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట ప్రకారం బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. మహా లింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామాలలో సర్పంచులు ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామాల అభివృద్ధి కోసం పార్టీలకు అతీతంగా పనిచేసేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ వీరేష్, మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి, ఎంపీడీఓ రవిచంద్ర కుమార్ రెడ్డి, సర్పంచులు బీసు కవితా కరుణాకర్ రెడ్డి, లంకాల సురేష్ రెడ్డి,పల్లె ఆనంద్, శ్యామల అఖిల్ రెడ్డి, ఎదిరే నాగేశ్వర్, సి. భాస్కర్ గౌడ్, జోగు వజ్రమ్మ, బర్కం యాదయ్య, బి. రాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ త్రిప్పిశెట్టి కరుణాకర్, మహాలింగేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ ఎదిరే మల్లేష్, నాయకులు యెన్నం శ్రీధర్ రెడ్డి, వై. గిరి యాదవ్ , రావుల పెంటయ్య, బీజారం అంజయ్య, కోడూరు రాములు , సంగేమ్ ఇబ్రహీం, బండెల రాజేందర్ రెడ్డి, తైద పర్వతాలు, రాణి, విజయ రెడ్డి, కర్రెడ్ల నరసింహారెడ్డి, వి. కిషన్ నాయక్, యం. డి ఆమేర్, నాగిళ్ల భాస్కర్ , సమీర్ పటేల్, గ్యార సురేష్, ఆవ రాఘవేందర్ , హరీశ్వర్ రెడ్డి , ఆరోగ్య రెడ్డి, పంది లింగం, రఘుపతి, బీమయ్య, కోడూరు శ్రీశైలం, కోడూరు నర్సింహా,రమేష్, మధు, అజహర్, సచిన్ పాల్గొన్నారు.



## బూరుగుపల్లి గ్రామంలో ఘనంగా రాచన్నస్వామి కళ్యాణ మహోత్సవం



**మోమిన్ పేట ఫిబ్రవరి 20 (జనంసాక్షి):** బురుగుపల్లి గ్రామంలో అంగరంగ వైభవంగా రాచన్న స్వామి కళ్యాణ మహోత్సవ ఘనంగా నిర్వహించారు శుక్రవారం బూరుగుపల్లి గ్రామ సర్పంచ్ పట్లోళ్ల వరప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో జాతర మహోత్సవ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు జాతర పురస్కరించుకుని గ్రామంలో బోనాలు ఊరేగింపు ఎడ్ల బండ్ల తో ఉత్సవ విగ్రహాలను ఊరేగింపు నిర్వహించి శివ పార్వతి దేవత మూర్తులను కళ్యాణ మండపానికి తీసుకువచ్చి శివ పార్వతి కళ్యాణంజరిగింది ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి మానెమ్మ గ్రామ సర్పంచ్ పట్లోళ్ల వరప్రసాద్ రెడ్డి గ్రామ పెద్దలు మానయ్య రమేష్ నాగేందర్ సంగప్ప శివయ్య భక్తులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## హత్య చేసి పుష్కరిణిలో పరేసిన గుర్తు తెలియని దుండగులు

**చేవెళ్ల, ఫిబ్రవరి 20 (జనంసాక్షి):** గుర్తుతెలియని వ్యక్తులు ఓ వ్యక్తిని కర్రతో భాధి హత్య చేసిన షుష్కరిణిలో పడేశారు. ఈ సంఘటన చేవెళ్ల పట్టణ కేంద్రంలోని చోటు చేసుకుంది. పోలీస్ లు తెలిపిన వివరాల ప్రకారం ఇలా ఉన్నాయి. తమిళనాడు' రాష్ట్రానికి చెందిన కరుణాకర్ (55) గత 20 సంవత్సరాల కిత్రం బతుకు దెరువు నిమిత్తం సంగారెడ్డి జిల్లా పటాన్ చెరువుకు వచ్చి భార్య తో కలిసి నివాసం ఉన్నాడు. అయితే గత 6 సంవత్సరాల క్రితం భార్య చనిపోయింది. దీంతో అక్కడి నుంచి చేవెళ్ల మండలానికి వచ్చాడు. అయితే మండలంలోని కందవాడ గ్రామానికి చెందిన బాలమణితో పరిచయం ఏర్పడింది. దీంతో కరుణాకర్ బాలమణితోనే 6 సంవత్సరాలుగా కలిసి కందవాడ గ్రామంలో నివాసం ఉంటు ఇద్దరు కలిసి కూలీపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కాగా ఈనెల 19వ తేది సాయంత్రం ఇద్దరు కలిసి ఆటోలో చేవెళ్ల పట్టణ కేంద్రంలో జరుగుతున్న మహాశివరాత్రి జాతరకు వచ్చారు. జాతరలో కలియ తిరిగిన తర్వాత పట్టణ కేంద్రంలో ఉన్న కల్లుదుకాణంలో కల్లు కొనుగోలు చేసి ఇద్దరు కలిసి స్వామి వారి పుష్కరిణి వద్ద ఉన్న మండపంలో కూర్చుని కల్లు తాగారు. రాత్రి పది గంటల వరకు ఇద్దరు కలిసే ఉన్నారు. ఏంజరిగిదో తెలియదు కాని శుక్రవారం ఉదయం కరుణాకర్ పుష్కరిణిలో శవమై కన్పించాడు. అయితే శుక్రవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో అటువైపు వెల్లిన యాత్రికులకు పుష్కరిణి ఒడ్డున శవం కన్పించడం తో పోలీస్ లకు సమాచారం అందించారు. దీంతో చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్, డీఐ సీఐ ఉపేందర్ చేరుకుని మృతదేహన్ని పుష్కరిణి నుంచి బయటకు తీయించారు. మృతి చెందిన కరుణాకర్ శరీరంపై కర్రలతో కొట్టి గాయపరిచిన ట్లు ఆధారాలు ఒంటిపై కన్పించాయి. పుష్కరిణి వద్ద ఉన్న మండపంలో రక్తం అంటిన కర్ర పోలీస్లకు లభించింది. హత్య ఎలా జరిగిందో తెలుసుకునేందుకు పోలీస్లు క్లూస్ టీమ్ ను రప్పించి వివరాలు సేకరించారు. బాలమణిని అదుపులోకి తీసుకుని విచారిస్తే అసలు విషయం బయటకు వచ్చే అవకాశం ఉందని పోలీస్ లు భావిస్తున్నారు. ఆమెకోసం గాలింపు చేస్తున్నట్లు పోలీస్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్లు స్పష్టం చేశారు.

## వీరశైవ సమాజం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం



**తాండూరు ఫిబ్రవరి 20 (జనంసాక్షి):** వీరశైవ సమాజం ఆధ్వర్యంలో నూతనం గా ఎన్నికైన మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ బాల్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. గురువారం పట్టణంలోని ప్రసిద్ధిగాంచిన శ్రీ బావి భద్రేశ్వర ఆలయంలో వీరశైవ సమాజం సభ్యులు నూతన మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ బాల్ రెడ్డి, కౌన్సిలర్లు , సర్పంచ్ లను బసవేశ్వర చిత్రపటం అందజేసి పూలమాల శాలు వాతో ఘనంగా సన్మానించారు.ముందు గా నూతనంగా మున్సిపల్ చైర్ పర్సన్ గా ఎన్నికైన నీరజబాల్ రెడ్డి ఆలయంలో కొలువుదీరిన శ్రీ బావిగి బద్రేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం వీరశైవ సమాజం ఆధ్వర్యంలో ధనసిరి అప్ప వారి వెంబడి శ్రీశైలం పాదయాత్రకు వెళ్లే భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వీరశైవ సమాజం సభ్యులు ఆలయ అర్చకులు తదితరులు ఉన్నారు.

## మద్రాస్ ఫిల్టర్ కాఫీ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి



**హయత్ నగర్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి):** హయత్ నగర్ ఇంజాపూర్ ప్రధాన రోడ్ మార్గంలో నూతనంగా ఏర్పాటు చేసిన మద్రాస్ ఫిల్టర్ కాఫీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవీ రెడ్డి సుధీర్ రెడ్డి, మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, స్థానిక తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డిలు ముఖ్య తిథులుగా పాల్గొని, ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువ పారిశ్రామిక వేత్తలు స్వయం ఉపాధి దిశగా ముందుకు రావడం ఆనందదాయకమని వారు అన్నారు. ఇలాంటి వ్యాపార సంస్థలు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే కాకుండా, ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి దోహదపడతాయని వారు తెలిపారు. హయత్ నగర్ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో కొత్త వ్యాపార సంస్థలు ప్రారంభమవడం అభినందనీయమని, వ్యాపారం మరింత అభివృద్ధి చెంది మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించాలని వారు ఆకాంక్షించారు. మద్రాస్ ఫిల్టర్ కాఫీ నిర్వాహకులు కౌశిక్, శివ కుమార్, సాయి కుమార్ లకు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజలు కూడా స్థానిక వ్యాపారాలను ప్రోత్సహించాలని వారు కోరారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ మద్రాస్ ఫిల్టర్ కాఫీ ప్రారంభోత్సవానికి విచ్చేసిన అతిధులకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు సామ తిరుమల్ రెడ్డి, కొప్పుల విఠల్ రెడ్డి, బిఆర్ఎస్ హయత్ నగర్ డివిజన్ అధ్యక్షుడు చెన్నగొని శ్రీధర్ గౌడ్, జక్కిడి రఘువీర్ రెడ్డి, నక్క రవీందర్ గౌడ్, భాస్కర్ సాగర్, పరంధ రమేష్, సంఘీ అశోక్, పాల్గొన్నారు.



## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

### దోర్నాలపల్లి కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో



**దోమ ఫిబ్రవరి 20 (జనంసాక్షి):** దోర్నాలపల్లి గ్రామానికి చెందిన పిచ్చకుంట్ల బసప్ప ఈరోజు ఉదయం మరణించడం జరిగింది. ఈ విషయం తెలుసుకొని దోర్నాలపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కుటుంబ సభ్యులు తక్షణ అవసరాల నిమిత్తం కొరకై 5,000/- వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సత్యనారాయణరెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్, దామోదర్ రెడ్డి, నాగేందర్ రెడ్డి, పి నరసింహారెడ్డి, పి వెంకట్ రెడ్డి, జంగయ్య, నరసింహులు, పి నర్సింలు, తదితరులు గ్రామస్తులు పాల్గొనడం జరిగింది.

## పాఠశాలకు కాంపౌండ్ మంజూరు

### పూజ చేసి ప్రారంభించిన సర్పంచ్ మాలి శివకుమార్ రెడ్డి



**దోమ ఫిబ్రవరి 20 (జనంసాక్షి):** దోమ మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి సహకారంతో కాంపౌండ్ మంజూరు అయ్యింది. ఈ సందర్భంగా దోమ గ్రామ సర్పంచ్ మాలి శివకుమార్ రెడ్డి పూజ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఉప్పల్‌లో ప్రభుత్వ పాఠశాలకు మహర్దశ

### రూ.2 కోట్లతో కొత్త భవన నిర్మాణానికి శ్రీకారం



**ఉప్పల్ ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :** రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాధాన్యం ఇస్తున్నారని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. నాణ్యమైన విద్యతో పాటు పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు. ఉప్పల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.2 కోట్ల నిధులతో చేపట్టనున్న నూతన భవన నిర్మాణ పనుల కోసం గుర్తించిన స్థలాన్ని పరమేశ్వర్ రెడ్డి అధికారులు, విద్యాశాఖ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన, రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి అవసరమైనన్ని నిధులను మంజూరు చేస్తూ ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేందుకు కట్టుబడి ఉందన్నారు. ఉప్పల్ నియోజకవర్గంలోనూ ఇదే తరహాలో పాఠశాల భవనాల నిర్మాణానికి కృషి కొనసాగిస్తామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ పాఠశాలలకు తీసిపోని విధంగా అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో మండల విద్యాధికారి రామారావు, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.ప్రభుత్వం చేపడుతున్న ఈ చర్యలతో విద్యార్థులకు మెరుగైన వసతులు, సురక్షితమైన వాతావరణం, నాణ్యమైన విద్య అందుబాటులోకి రానుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## ఫైన్ ఆర్ట్స్ కాలనీలో గుంతల రోడ్లకు శాశ్వత పరిష్కారం

### సొంత ఖర్చులతో మరమ్మత్తులు చేపట్టిన నిరుడు శేఖర్ ముదిరాజ్



**రాజేంద్రనగర్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి):** కిస్మత్‌పూర్ 122 డివిజన్ పరిధిలోని ఫైన్ ఆర్ట్స్ కాలనీలో గుంతలతో దెబ్బతిన్న రోడ్ల సమస్యకు తక్షణ ఉపశమనం లభించింది. స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గమనించిన కిస్మత్‌పూర్ మాజీ ఉపసర్పంచ్ మరియు రంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యులు నిరుడు శేఖర్ ముదిరాజ్ తన ఔదార్యం చాటుకున్నారు. స్వయంగా ముందుకు వచ్చి సొంత ఖర్చులతో రోడ్లకు మొరం పోసి మరమ్మత్తులు చేపట్టారు. గత కొంతకాలంగా కాలనీలో రోడ్లు దెబ్బతినడంతో ఉద్యోగులు, విద్యార్థులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో రాకపోకలు కష్టసాధ్యంగా మారుతున్నాయి. ఈ సమస్యను అధికారులు దృష్టికి తీసుకెళ్లినా సరైన స్పందన రాకపోవడంతో, ప్రజల కష్టాన్ని తన సమస్యగా భావించిన శేఖర్ ముదిరాజ్ తక్షణ చర్యలు తీసుకున్నారు. ఈ చర్యతో కాలనీ వాసులకు తక్షణ ఉపశమనం లభించగా, స్థానికులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల కోసం పదవి అవసరం లేదని, సేవే తన ధ్యేయమని ఆయన మరోసారి చాటిచెప్పారు.

## గౌరవ డాక్టరేట్ అందుకున్న కిన్నెర మొగులయ్యను సన్మానించిన

### వనస్థలిపురం ఎస్ హెచ్ ఓటి మహేశ్ గౌడ్



**హయత్ నగర్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి):** తెలంగాణ సంస్కృతిలో అరుదైన కళగా పేరొందిన 12 మెట్ల కిన్నెర గానాన్ని ప్రపంచానికి చాటిన చెప్పిన గొప్ప కళాకారుడు పద్మశ్రీ దర్శనం మొగులయ్య గౌరవ డాక్టరేట్ అందుకున్న సందర్భంగా వనస్థలిపురం పోలీస్ ఇన్‌స్పెక్టర్ టి.మహేశ్ గౌడ్ వారి కార్యాలయంలో శాలువాతో సన్మానించి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మహేష్ గౌడ్ మాట్లాడుతూ అంతరించి పోతున్న కళలను తన ప్రదర్శనల ద్వారా వెలుగులోకి తెచ్చిన మొగులయ్యకు ఇటీవల చెన్నైలోని 'గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ' గౌరవ డాక్టరేట్ ను ప్రదానం చేసిందని, కళా రంగంలో వారి కృషి రాష్ట్రానికి, దేశానికి గౌరవాన్ని తీసుకువచ్చిందని వారు ప్రశంసించారు.

## రాకమచర్ల పీఠాధిపతి శ్రీ వెంకట దాసు ఆధ్వర్యంలో

# శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవం..!!

**పల్లకి శోభ రథయాత్ర ఊరేగింపు..!!**

**నవాబుపేట్, (జనంసాక్షి):** శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవం శ్రీ వెంకటేశ్వర ఆలయం చైర్మన్ గోపాల్ రెడ్డి,నవాబుపేట్ మండల పరిధిలోని చిటిగిద్ద గ్రామంలో శుక్రవారం వరకు శ్రీ వినాయక, శ్రీదేవి, భూదేవి,సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఉమ్మెత్త పీఠాధిపతులు పూజ్యశ్రీ వెంకట దాస్ ఆశీస్సులతో ఆలయం అర్చకులు రవికుమార్, రాఘవేందర్ రావు అంతరిచే జరపబడుతున్నటువంటి గ్రామ సర్పంచ్ పోతురాజు శ్రీధర్ రావు, ఉప సర్పంచ్ అనసూయ రంగయ్య గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీ వెంకటేశ్వర కళ్యాణోత్సవం స్వామివారు సుప్రభాతంతో నిత్య పూజ, నవగ్రహ శాంతి పూజ, గద్వారాణం, గోవులు, గిరి ప్రదర్శన. శటస్థల బ్రహ్మ శ్రీ శ్రీ శివయోగి శివచార్యులు ఆధ్వర్యంలో. మానస పూజ,భజన కార్యక్రమాలు స్వామివారి సుప్రభాతంతో మేలుకొలుపు హనుమాన్ చందనాధారాలు శ్రీదేవి, బుదేవి, వెంకటేశ్వర స్వామి కళ్యాణ్ మహోత్సవంలో రాకంచెర్ల పీఠాధిపతులు వెంకటేదాస్, పరిగి భాస్కరాచార్యులు పాల్గొన్నారు .ఆలయం అర్చకులు రవికుమార్ కళ్యాణ మహోశవం కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ సర్పంచ్ శ్రీధర్ రావు, ఉప సర్పంచి అనసూజా



ఆధ్వర్యంలో నిర్వహించినరూ ఇతర గ్రామాల భక్తులచే పూజ కార్యక్రమాలు జరుపబడును. మహనీయుల ప్రవచనలు ఉమ్మెత్తల వెంకట దాస్, పరిగి భాస్కర్ యోగి ద్వారా ప్రవచనాలు నిర్వహించారు.పల్లకి సేవ 20వ తేదీ శుక్రవారంనాడు అభిషేకాలు చిట్టి గిద్ద గ్రామ చివరిలో ఉన్నటువంటి వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవానికి వివిధ గ్రామాల నుండి ప్రజలు హాజరై కళ్యాణోత్సవము కార్యక్రమాలు చేపట్టాలనిశ్రీదేవి, భూదేవి, సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ 10గంటల నుండి 2 గంటల వరకు మహనీయుల ప్రవచనాలు, భాస్కరయోగి ఆధ్యాత్మికవేత్త, తీర్థం ప్రసాదాలు తదుపరి కన్యాదానం, శ్రీదేవి భూదేవి కార్యక్రమాలు. స్వామివారి రథోత్సవమ హనుమాన్ దేవాలయం నుండి గ్రామ ప్రదక్షణలతో శ్రీ వెంకటేశ్వర



దేవాలయం వరకు జరుగుతాయని అర్చకులు రవికుమార్ తెలిపారు. ఆయన తెలిపారు. శ్రీ వెంకటేశ్వర దేవస్థానం చిట్టిగిద్ద గ్రామం ప్రజలు రెండు రోజులు ప్రతి ఒక్కరూ ఆలయం కు హాజరై పూజ కార్యక్రమంలో పాల్గొని అందరూ హాజరుకావాలని గ్రామంలోని ప్రతి ఒక్కరూ కులమతాలకు అతీతంగా బడుగు బలహీన వర్గాలు అందరూ హాజరుకావాలని ఆలయం కమిటీ సభ్యులు గ్రామం పెద్దలు సర్పంచులు మాజీ సర్పంచులు మాజీ ఎంపిటిసిలు వివిధ పార్టీ నాయకులు గ్రామంలోని ప్రతి ఒక్కరూ అమ్మలు అక్కలు అన్నలు యువజన సంఘాల అందరూ ఏకమై వెంకటేశ్వర స్వామి వార్షికోత్సవాన్ని చేయాలని కోరుతున్నారు.

## ఐసీఎంఏఐ ప్రాంతీయ సదస్సును ప్రారంభించిన డాక్టర్ ఏఎస్ దుర్గాప్రసాద్

**శామీర్ పేట,(జనంసాక్షి):** మేడ్చల్ జిల్లా శామీర్ పేట మండలంలోని లియోనియా రిసార్ట్స్‌లో కాస్ట్ అండ్ మేనేజ్మెంట్ అకౌంటెంట్స్ వృత్తిని పునర్నిర్మి ంచడమే లక్ష్యంగాది ఇన్స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ప్రతిష్టాత్మక రీజినల్ కాస్ట్ అండ్ మేనేజ్ మేంట్ అకౌంటెంట్స్ కన్వెన్షన్ -2026ను నిర్వహించారు. ది ఇన్స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా కు చెందిన సదరన్ ఇండియా రీజినల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో రెండు రోజులు జరుగనున్న ఈ సదస్సు కు ముఖ్య అతిధిగా విచ్చేసిన ఎన్సీస్ చైర్మన్ ఐసీ ఎంఏఐ మాజీ అధ్యక్షులు సీఎంఏ డాక్టర్ ఏ ఎస్ దుర్గాప్రసాద్ ప్రారంభించారు. వీరిలో పరిశ్రమల అధిపతులు, విద్యావేత్తలు, విధాన కర్తలు సిఎంఏ నిపుణులు ఉన్నారు. పనితీరులో అత్యుత్తమ ప్రమాణాలు, బాధ్యతయుతమైన వృద్ధి, భవిష్యత్తు సవా ళ్ళను ఎదుర్కొనే లక్షణాలు పెంపొందించడంలో సిఎంఏ పాత్రను బలోపేతం చేయడం పై ఈ సదస్సు ద్రుష్టి సారించింది. ఈ సందర్భంగా ఎన్సీపీ చైర్మన్, ఐసీఎంఏఐ మాజీ అధ్యక్షులు సీఎంఏ డాక్టర్ ఏ ఎస్ దుర్గాప్రసాద్ మాట్లాడు తూ.. సంస్థాగత పనితీరును మెరుగు పరచడం లో, దేశ నిర్మాణ మౌళిక సదు పాయా లను బలోపేతం చేయడంలో ఇంటిగ్రెటెడ్ కాస్ట్ లీడర్ షిప్ అమలు డేటా ఆధారిత నిర్ణయాలు తీసుకోవడం వంటివి అత్యంత కీలకమ న్నారు. అనంతరం సీఎంఏ, టీసీఏ శ్రీనివాస్ ప్రసాద్ మాట్లాడుతూ.. వ్యూహా త్మక వ్యాపార భాగ స్వాములుగా సీఎంఏ పాత్ర మారుతుందన్నారు. ఈఎస్టి (పర్యావ రణం, సామజిక, పాలన) గవర్నెన్స్, వ్యాల్యూ ఇంజనీరింగ్ వంటి కీలక రంగాలలో నిపుణులు నాయకత్వం వహించాలని పిలుపునిచ్చారు. తద్వా రా స్థిరమైన, బాధ్యత యుతమైన వృద్ధికి ఈ వృత్తి కట్టుబడి ఉందని చెప్పవ చ్చున్నారు. అదేవిదంగా ఎస్ఐఆర్సీ చైర్మన్ సీఎంఏ విజయ్ కిరణ్ ఆగస్త్య మాట్లాడుతూ... ఇది కేవలం చర్చ వేదిక మాత్రమే కాదని, ఆచరణత్మక జ్ఞానాన్ని పంచుకునే వేదికని చెప్పారు. వ్యాల్యూ ఇంజనీరింగ్, డిజిటల్ పెర్ఫా మేన్స్ మేనేజ్మెంట్, స్థిరమైన వృద్ధి చర్చల ద్వారా సంస్థాగత పరివర్తనకు సీఎం ఏ లను సిద్ధం చేయడమే మా లక్ష్యమని తెలిపారు. ఈ కార్య క్రమంలో ఐసీఎం ఐఏ విజయ్ కిరణ్ ఆగస్త్య, ఎస్ఐఆర్సీ ట్రెజరర్ సీఎంఏ కేవిఎన్ లావణ్య, ఐసీఎంఏఐ హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ సీఎంఏ ఖాజా జలాల్ ఉద్దీన్, ఎస్ఐఎఫ్ఏ మాజీ అధ్యక్షులు సీఎంఏ ఏఎన్ రామన్ పాల్గొన్నారు.



## ఈటల రాజేందర్‌ను సన్మానించిన

### మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి



**హయత్ నగర్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి):** హయత్ నగర్ తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలసి, శాలువాతో సన్మానించి, హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ హయత్ నగర్ డివిజన్ సమగ్ర అభివృద్ధి కోసం కోట్ల రూపాయల నిధులను మంజూరు చేసి, పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన ఈటల రాజేందర్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. రోడ్లు, భూగర్భ డ్రైనేజ్, సీసీ రోడ్లు, స్ట్రీట్ లైట్లు, కమ్యూనిటీ హాల్స్, తదితర మౌలిక వసతుల అభివృద్ధిలో వారి సహకారం ఎంతో కీలకమని వారు అన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి వేగంగా స్పందిస్తూ డివిజన్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న నాయకుడు ఈటల రాజేందర్ అని వారు కొనియాడారు. భవిష్యత్తులో కూడా హయత్ నగర్ అభివృద్ధికి తమ పూర్తి సహకారం అందించాలని వారు కోరారు.

## అభివృద్ధి పనులపై సీఎం సలహాదారుడిని కొలన్ హన్మంత్ రెడ్డి



**నిజాంపేట్ (జనంసాక్షి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులు అలాగే మౌలిక సదుపాయాల సమస్యల పరిష్కారం కొరకు శుక్రవారం ముఖ్యమంత్రి సలహాదారు ప్రజా వ్యవహారాల దారుడు వేం నరేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేసిన నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న రోడ్లు, డ్రైనేజీ, పార్కుల అభివృద్ధి, తాగునీటి సరఫరా మౌలిక సమస్యలను ,ప్రజల ఇబ్బందులను వివరించగా వేంనరేందర్ రెడ్డి సానుకూలంగా స్పందించి సంబంధిత పై అధికారులతో చర్చించి సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు టి.లక్ష్మీ రెడ్డి, రషీద్, సిద్దనోల్ల సంజీవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సమస్యల పరిష్కారంలో జర్నలిస్టుల పాత్ర మరువలేనిది





- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్
- సమాజ నిర్మాణంలో జర్నలిస్టుల పాత్ర కీలకం
- మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి
- మేడిపల్లి ప్రెస్ క్లబ్ డైరీ ఆవిష్కరించిన మల్కాజిగిరి ఎంపీ,మేడ్చల్ ఎమ్మెల్యే

**బోడుప్పల్ (జనంసాక్షి):** బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని వేదిక బాంక్వేట్ హాల్ లో శుక్రవారం మేడిపల్లి మండల ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ 2026 డైరీ ఆవిష్కరణ కార్యక్రమం క్లబ్ అధ్యక్షుడు చిర్ర శ్రీధర్ రెడ్డి ఆద్వర్యం లో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు గా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్,మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పాల్గొన్ని 2026 డైరీ ఆవిష్కరించారు.ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక సమస్యల పరిష్కారంలో లోకల్ జర్నలిస్టుల పాత్ర మరువలేనిదని,నేడు సమాజ నిర్మాణంలో జర్నలిస్టుల పాత్ర కీలకమైందన్నారు.ప్రభుత్వాలకు ప్రజలకు మద్య వారధిగా ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి ఇంకా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి వడ్డెమాను సుందర్,కోశాధికారి మరాటి మల్లేష్,సలహాదారులు కల్లూరి ఎల్లయ్య, ఉపాధ్యక్షుడు చింత రమేష్ పీర్జాదిగూడ నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి,బోడుప్పల్ నగర బీఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి,మాజీ డీప్యూటి మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్,సీపీఎం మండల కార్యదర్శి సృజన,సీపీఐ మండల కార్యదర్శి రచ్చ కిషన్,మాజీ కోఆప్షన్ సభ్యులు చిలుముల జగదీశ్వర్ రెడ్డి, చెంగిచెర్ల మాజీ ఉపసర్పంచ్ కొత్త రవి గౌడ్ మాజీ ఎంపిపీ బండారు శ్రీనివాస్ గౌడ్,మాజీ ఎంపిటిసి నర్సింగ్ రావు,కె వెంకటేష్ గౌడ్,మైనారిటీ అధ్యక్షుడు మదార్, క్లబ్ సీనియర్ సభ్యులు ననుబోతు రాము యాదవ్, దూడల విష్ణుగౌడ్, కోఅర్డినేటర్ రావు నాగిరెడ్డి, సంయుక్త కార్యదర్శులు చిన్నం మధు,దాసరి దయాకర్ రెడ్డి, నీరుడి అంజన్ కుమార్,కార్యవర్గ సభ్యులు చిన్నం గణేష్,భూష గణెష్, మరాటి మత్స్యగిరి,జక్కు భగీరద్ రెడ్డి, మోతె రఘు తిరుపతి రెడ్డి, జంగ నరేందర్ యాదవ్, క్లబ్ సభ్యులు బైరెడ్డి సందీప్ రెడ్డి, కొండ కింది సురేందర్ రెడ్డి సిహెచ్ రవికుమార్ బి సిద్దు, పాల్గొన్నారు.



### శిలాఫలకాలపై పేరు లేకపోయినా

# ప్రజల గుండెల్లో స్థానం నాదే

- డివిజన్ అభివృద్ధికి రూ.114 కోట్ల అభివృద్ధి నా కృషి ఫలితం
- మాజీ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి



**రాజేంద్రనగర్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి):** మైలార్ దేవ్‌పల్లి డివిజన్‌లో తన హయాంలో మంజూరైన అభివృద్ధి పనుల నిధులను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తన ఖాతాలో వేసుకుంటూ డప్పు కొడుతున్నారని మాజీ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం కాటేదాన్ బీజేపీ కార్యాల యంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మా ట్లాడారు. 2016లో మొదటిసారి కార్పొరేటర్‌గా ఎన్నికై, డివిజన్ అభివృద్ధికి కట్టుబడి పనిచేశానని తెలిపారు. తన పదవీకాలంలో మొత్తం రూ.114 కోట్లకు పైగా జీహెచ్‌ఎం సీ, ప్రాజెక్టు నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పనులు చేపట్టామ ని చెప్పారు. అందులో భాగంగా రూ.86.30 కోట్లతో 338 పనులు పూర్తిచేసి, మరో రూ.53.72 కోట్లతో 254 పనులు పూర్తి చేశామని వెల్లడించారు. ఇంకా రూ.33.21 కోట్లతో 84 పనులు శాంక్షన్ అయి, టెండర్ ప్రక్రియలో ఉన్నాయని వివరించారు. సీసీ రోడ్లు, బాక్స్ డ్రైన్లు, నాళా లు, యువజన క్లబ్బులు, మహిళా భవనాలు, పార్కులు వంటి అనేక రంగాల్లో అభివృద్ధి చేశామని తెలిపారు. అప్పాచెరువు నాలా, దుర్గా నగర్ నుంచి పల్లె చెరువు వరకు బాక్స్ డ్రైన్ పనులు, స్పోర్ట్స్ కాంప్లెక్స్, స్విమ్మింగ్ పూల్ వంటి ప్రాజెక్టులు చేపట్టినట్లు చెప్పారు. శివరేజ్ పనులకు రూ.5.15 కోట్లు ఖర్చు చేసి, మిగిలిన పనులు త్వరలో పూర్తిచేస్తామని అన్నారు. తన పదవీకాలంలో భిన్న ప్రభుత్వాలు ఉన్నప్పటికీ ప్రతిపక్ష కార్పొరేటర్‌గా పోరాటం చేసి నిధులు సాధించామని పేర్కొన్నారు. శిలాఫలకాలపై పేరు లేకపోయినా, ప్రజల గుండెల్లో తన పేరు చెరగదని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తన పదవీకాలం ముగిసిన తరువాత శంకుస్థాపనలు చేసి అభివృద్ధి తన దేనని ప్రచారం చేయడం సరికాదన్నారు. నిజమైన అభివృద్ధి కోసం రూలింగ్ ప్రభుత్వంలో ఉన్న ఎమ్మెల్యే అధిక నిధులు తీసుకురావాలని డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటం కొనసాగిస్తామని శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి అధ్యక్షుడు పాండు యాదవ్, రావుల భాస్కర్ బుచ్చిరెడ్డి, సంతుగౌడ్ అధిక జనార్ధన్, ఎల్బీ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, ప్రభుదాస్ పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికంతో అలరారిన బాణాపూర్



- భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభ ప్రతిష్టాపన
- దుష్టశక్తుల నుండి ఊరిని రక్షించే గ్రామ దేవత నాభిశిల
- మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వర్త్య విఠల్ నాయక్

**తాండూరు (జనంసాక్షి):** ఆధ్యాత్మికంతో బాణాపూర్ గ్రామం భక్తజన సంద్రోహంతో అలరారింది. గత మూడు రోజులపాటు గ్రామంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పండుగ వాతావరణం నెలకొంది. శుక్రవారం యాలాల మండలం బానాపూర్ లో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వర్త్య విఠల్ నాయక్ మరియు కుటుంబ సభ్యులు, బానాపూర్ గ్రామప్రజలతో కలిసి బొడ్రాయి, ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలో నెలకొన్న హనుమాన్ ఆలయం ఎదురుగా భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభాన్ని ప్రతిష్టాపించారు. అదేవిధంగా గ్రామ ప్రజల సమక్షంలో నాబిశిల బొడ్రాయిని ప్రతిష్టాపించారు. వేద పండితుల మంత్రాలతో బాణాపూర్ గ్రామంలో ఆధ్యాత్మిక శోభనేలకోంది. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విఠల్ నాయక్ మాట్లాడుతూ.. గ్రామల నడిమద్యలో ప్రతిష్టించే పవిత్రమైన శిల, ఇది గ్రామానికి నాభి (బొడ్డు) వంటిదని, దుష్టశక్తుల నుండి ఊరిని రక్షించే గ్రామ దేవతగా భావిస్తారు. గ్రామ నిర్మాణం సమయంలో, కరువు కాటకాలు, అరిష్టాలు కలగకుండా ఉండేందుకు భవనీయ పూజారులచే ఈ రాయిని శాస్త్రోక్తంగా ప్రతిష్ఠిస్తారు. ఊరి మధ్యలో కొలువై ఉండి రక్షణ కల్పిస్తుందన్నారు. గ్రామంలో అకాల మరణాలు, రోగాలు, క్షుద్ర శక్తులు ప్రవేశించకుండా ఈ రాయి అంగరక్షకుడిగా ఉంటుందని గ్రామస్తుల నమ్మకంగా బావిస్తారు .గ్రామంలో శుభకార్యాలు జరిగేటప్పుడు బొడ్రాయికి ప్రత్యేక పూజలు, ఉత్సవాలు (బొడ్రాయి పండుగ) జరుపుకుంటారు.ప్రతిష్ట తరచుగా, ఈ రాయి కింద యంత్రాలను ప్రతిష్ఠించి, లింగమయ్య లేదా శీతలాదేవి అమ్మవారి రూపంగా పూజిస్తారు. గ్రామ యోగక్షేమాలను పర్యవేక్షించే శక్తిగా బొడ్రాయిని పూజించడం ప్రాచీన సంప్రదాయమన్నారు. ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరు భక్తి భవాని అలవర్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు ,విఠల్ నాయక్ కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.



## జిల్లా గ్రంథాలయ సంస్థ నూతన సభ్యుల నియామకం



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి (జనంసాక్షి):** మేడ్చల్––మల్కాజిగిరి జిల్లా గ్రంథాలయ సంస్థకు సంబంధించిన నూతన సభ్యులను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నియమించినట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ పరిధిలో 2026––27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కార్యకలాపాలను సమర్థవం తంగా నిర్వహించేందుకు అభ్యర్థులను నియమించినట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పుస్తక పఠన సంస్కృతి పెంపొందించడం, డిజిటల్ సేవలను విస్తరించడం, పాఠకులకు ఆధునిక వనరులు అందుబాటులోకి తీసుకురావడం లక్ష్యంగా ఈ నియామకాలు చేపట్టినట్లు తెలిపారు.అదేవిధంగా రాబోయే సంవత్సరానికి రూపొం దించిన బడ్జెట్ అంచనాల అమలు, గ్రంథాలయాల అభి వృద్ధి కార్యక్రమాలు, పాఠకులకు అవసరమైన సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి ప్రతినిధి, మున్సిపల్ ప్రతినిధులు, జిల్లా శాశ్వత సభ్యులు, కార్యదర్శి శ్రీ పి. సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు. జిల్లాలో గ్రంథాలయ అభివృద్ధి ద్వారా పాఠకులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని అధికారులు తెలిపారు.

## మౌలిక సదుపాయాలే లక్ష్యం

### ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**రాజేంద్రనగర్, (జనంసాక్షి):** రాజేంద్రనగర్ నియోజక వర్గంలో మౌలిక సదుపాయాల అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ పేర్కొన్నారు.శుక్రవారం మైలర్ దేవ్‌పల్లి డివిజన్‌లోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో సుమారు రూ.9.80 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, కాలనీలలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తున్నదని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యేగా ప్రజల సమస్యలను తెలుసుకుంటూ దశలవారీగా పరిష్కరిస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు,



స్థానిక నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఎన్. ధనుంజయ, ప్రేమ్ గౌడ్, అడికే రాజు తదితరులు పాల్గొన్నారు.







# మనోహరుడి మంత్రం

- అభ్యర్థుల ఎంపిక నుంచి విజయం వరకు అద్భుత వ్యూహం
- గ్రామ-పట్టణ ఓటర్లపై పూర్తి పట్టు
- ఎమ్మెల్యే పనితనం, సంక్షేమ పథకాలతో హస్తం హవా

## తాండూరు మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా

### హంగు ఆర్భాటలు లేకుండా చైర్మన్-వైస్ చైర్మన్ ప్రమాణ స్వీకారం

**తాండూర్, ఫిబ్రవరి 20 (జనంసాక్షి) :**

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన నేపథ్యంలో తెలంగాణలో లోకల్ బాడీ ఎన్నికలపై సీఎం రేవంత్ రెడ్డి ఫోకస్ చేయడంతో రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల వాతావరణం వేడెక్కింది. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 100కు పైగా స్థానాలతో విజయకేతనం ఎగరవేసిన కాంగ్రెస్.. తాండూర్ మున్సిపల్‌లోనూ అదే హవా కొనసాగించింది. ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మంత్రంతో అభ్యర్థుల ఎంపిక నుంచి ఫైనల్ రిజల్ట్స్ వరకు అంతు చిక్కని ప్లానింగ్‌తో పార్టీ ఘనవిజయం సాధించింది.

సర్పంచ్ ఎన్నికల్లో రూరల్, మున్సిపల్ ఎన్నికలతో ఆర్బన్ ఓటర్లపై పూర్తి పట్టు సాధించిన కాంగ్రెస్.. ఎమ్మెల్యే పనితీరుతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలతో హస్తం హవా బలపడింది. హంగు ఆర్భాటలు లేకుండా చైర్‌పర్సన్‌గా పట్లోళ్ల నీరజ బాల్ రెడ్డి, వైస్ చైర్‌పర్సన్‌గా అబ్దుల్ రజాక్ ప్రమాణ స్వీకారం పూర్తయింది. శాంతి భద్రతలకు మొదటి ప్రాధాన్యత ఇస్తామని ఎమ్మెల్యే ఆలోచనలు స్పష్టం చేశారు.

తాండూర్ రాజకీయాలు మరింత వేడెక్కాయి. మున్సిపల్ ఎన్నికలకు నెల ముందు నుంచే ఎమ్మెల్యే వర్సెస్ మాజీ ఎమ్మెల్యే మధ్య మాటల యుద్ధం జరిగింది. గత ఐదేళ్ల మాదిరిగా రాజకీయ కక్షలతో పట్టణం ఏమవుతుందని ప్రజలు ఆందోళన చెందిన రోజులు ఉన్నాయి. అయితే అలాంటివి ఏమీ లేకుండా ప్రశాంత వాతావరణంలో కాంగ్రెస్ నాయకులు ప్రచారం పూర్తి చేసుకున్నారు. 19 సీట్లతో విజయఢంకా మోగించి ఇతర పార్టీల సాయం లేకుండానే సొంతంగా చైర్‌పర్సన్ పీఠం కైవసం చేసుకున్నారు. బీఆర్ఎస్ చైర్‌పర్సన్ అభ్యర్థి పట్టోళ్ల నర్సింహులును ప్రకటించి దూకుడు ప్రచారం చేసినా.. ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ప్లానింగ్ ముందు చివరికి ఓటమి చెందారు. కాంగ్రెస్‌కు కలిసొచ్చిన అంశాలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సామాజిక న్యాయంతో అభ్యర్థుల ఎంపిక, కొత్తవారి కి అవకాశాలు, బుయ్యని బ్రదర్స్ (మనోహర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి) ప్రచారం, మున్సిపల్ 75 సంవత్సరాల ఉత్సవాలకు సీఎం రేవంత్ రెడ్డి హాజరవుతారని విస్తృత ప్రచారం చేయడం వంటివి ఉన్నాయి. కాంగ్రెస్‌కు కలిసిరాని అంశాలు కొన్ని వార్డుల్లో గ్రూపు తగాదాలు, సీనియర్ నాయకులున్నా ఇతర పార్టీల నుంచి వచ్చినవారికి అవకాశం ఇవ్వడం, కొన్ని వార్డుల్లో బీజేపీ-బీఆర్ఎస్ కలిసి ప్రచారం చేయడం వంటివి ఉన్నాయి.

అధికారంలో లేకపోయినా బీఆర్ఎస్ జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో తాండూరులో గట్టి పోటీ ఇచ్చింది. మొదట చైర్‌పర్సన్ పీఠం బీఆర్ఎస్‌కే వస్తుందని అందరూ అనుకున్నా.. చివరి రెండు రోజుల ప్రచారంలో పరిస్థితులు తారుమారయ్యా యి. అధికార పార్టీ చైర్‌పర్సన్ పీఠం కైవసం చేసుకుంది.

బీఆర్ఎస్‌కు కలిసొచ్చిన అంశాలు అభ్యర్థుల ఎంపిక ముందుగా ప్రకటించడం, కాంగ్రెస్ గ్రూపు తగాదాలను తమకు అనుకూలం గా మార్చుకోవడం, కేటీఆర్ రోడ్ షోతో గ్రాఫ్ పెరగడం వంటివి ఉన్నాయి. బీఆర్ఎస్‌కు కలిసిరాని అంశాలు ప్రతిపక్షంగా ఉండటం, అధికార పార్టీలో కొత్తవారికి టికెట్లు ఇవ్వడం, డాక్టర్ సంపత్ తన వర్గానికి టికెట్లు ఇచ్చుకోవడం, ఆయన పెత్తనం సాగుతుందని ప్రచారం జరగడం వంటివి ఉన్నాయి. చైర్‌పర్సన్ అభ్యర్థిని మొదటగానే ప్రకటించినా ఫలితం రాలేదు.











